క్లుప్తంగా

ప్రతిఒక్కరికీ వంద రోజుల పని



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ వంద రోజులు ఉపాధి పనులు కల్పించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని మేడిగూడలో ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి పనులతో కూలీలకు కాలువలు, కట్టల నిర్మాణాల ద్వారా వ్యవసాయ భూములు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు పని ప్రదేశంలో ఉండి పనులు ప ర్యవేక్షించాలన్నారు. కొలతలు తీసుకునేట ప్పుడు నిబంధనలు పాటించాలని సూచించారు.

ఆర్థికసాయం

తాంసి: తలమడుగు మండలంలోని ఘరి పూనగూడ గ్రామానికి చెందిన సిడాం నరహరి కాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ గణేష్ రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి నరహరిని పరామర్శించి రూ.5వేలు అందజేశారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ బాబన్న, వైస్ ఎంపీపీ మాధవ్, జ్ఞానేశ్వర్, ప్రతాప్, నర్సయ్య, రాజు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో వినోద్‌కుమార్

తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామ శివారులో అంతరాష్ట్ర రోడ్డు పక్కన నూతనంగా నిర్మించనున్న పెట్రోల్ బంక్ నిర్మాణ స్థలాన్ని ఆర్డీవో వినోద్ కుమార్ పరిశీలించారు. గ్రామశివారులోని సర్వే నంబర్ 36 ఉన్న భూమిని తహసీల్దార్ లక్ష్మితో కలిసి పరిశీలించారు. బంక్ నిర్మాణానికి స్థలం అనువుగా ఉన్నట్లు గుర్తించారు. వారి వెంట జూనియర్ అసిస్టెంట్ బాపురావు, మాజీ సర్పంచ్ నర్సింగ్ ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈవో

బోథ్: రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చింతగూడ, బాబెర గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని సూచించారు. అధికారుల సూచన మేరకు విత్తాలన్నారు. అనంతరం మర్లపెల్లి గ్రామంలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న దీక్షాపరులు

తాంసి: మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామంలో బుధవారం హనుమాన్ దీక్షాపరులు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో హనుమాన్ విగ్రహాన్ని ఉంచి ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. భజన సంకీర్తనలు ఆలపిస్తూ, నృత్యం చేస్తూ.. ముందుకు సాగారు. మహిళలు మంగళ హారతులతో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు నరేందర్, రమేశ్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

తాంసి: బైక్ అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన అశోక్ జిల్లా కేంద్రానికి పని నిమిత్తం బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో సావర్గాం గ్రామశివారులో అంతరాష్ట్ర రహదారి మూలమలుపు వద్ద అదుపు తప్పింది. దీంతో చేతికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు పనులు పూర్తయ్యేదెప్పుడో?



కంకర తేలిన రోడ్డు

- తరోడ వంతెన కుంగడంతో లాండసాంగ్వి రోడ్డుకు మోక్షం
- గడువులోగా పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు

ఆదిలాబాద్‌రూరల్: రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలు మొరాయిస్తున్నాయని జిల్లా కేంద్రానికి అనుకొని ఉన్న లాండసాంగ్వి గ్రామ మీదుగా వెళ్లే ప్రజలు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. అయినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గత వర్ష కాలంలో జైనథ్ మండలంలోని తరోడ వంతెన కుంగిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం లేకపోవడంతో జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి సమీపం నుంచి నిరాల వరకు 15 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ. 30 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో లాండసాంగ్వి గ్రామం మీదుగా వెళ్లే రోడ్డుకు మోక్షం లభించింది.

కొనసాగుతున్న పనులు..

సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సీఆర్ఐఎఫ్) నిధులతో గత ఏడాది సెప్టెంబర్‌లో జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామం మీదుగా ఏడు మీటర్ల వెడల్పుతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జైనథ్ మండలం తరోడ వంతెన కుంగిపోవడంతో వర్షాలు ప్రారంభం కంటే ముందు లాండసాంగ్వి గ్రామం మీదుగా కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు పూర్తికాకపోతే అటు వైపు నుంచి వెళ్లే ప్రయాణికులతో పాటు లాండసాంగ్వి, అర్లి (బి), జైనథ్ మండలంలోని ఆడ, కంఠ, నిరాల గ్రామాలతో పాటు బేల మండలంలోని ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

విద్యుత్ స్తంభాలు అడ్డంకి

ఆదిలాబాద్ నుంచి లాండసాంగ్వి గ్రామం మీదుగా జైనథ్ మండలానికి 33/11 కేవీ విద్యుత్ స్తంభాలను గత నాలుగైదు నెలల కిందట ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్, లాండసాంగ్వి గ్రామాల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు రోడ్డుకు మధ్యలో రావడంతో ఆటంకం కలుగుతోందని తెలుస్తుంది. రోడ్డు విస్తరణ పనులు జరిగితే అడ్డంకిగా మారుతుందని, కొంత లోపల స్తంభాలు వేయాలని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజాధనం వృథా అవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాలు పడేకంటే ముందే రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

పేరు మారింది.. సేవలూ మారాలి



వడూర్‌లోని బస్తీ పల్లె దవాఖాన

- ఆరోగ్య మందిర్‌గా బస్తీ, పల్లె దవాఖానాలు
- వసతులు కల్పించాలని కోరుతున్న ప్రజలు

నేరడిగొండ: మారుమూల ప్రాంతాలకు ప్రాథమిక వైద్యాన్ని విస్తరించాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన పల్లె, బస్తీ దవాఖానాల పేర్లు మారాయి. ఇకనుంచి వీటిని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా పిలవాల్సి ఉంటుంది. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలుగా ప్రకటించిన కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ 2023 ఏడాది చివరి నాటికి ఆరోగ్య మందిర్‌గా పేరు మార్చాలన్న ఆదేశాలను వైద్యశాఖ అమలు చేసింది. జిల్లాలో పేరు మార్చిన 69 ఆరోగ్య మందిరాల్లో ఆరోగ్య సేవలు మెరుగవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఐదువేల మందికి ఒక కేంద్రం..

ఆయుష్మాన్ భారత్ పేరిట దేశంలో వైద్య సేవలను విస్తరిస్తున్నారు. అందులో భాగంగా ఆరోగ్య ఉప కేంద్రాలను బలోపేతం చేయడం ఒకటి. హెల్త్ అండ్ వెల్‌నేస్ కేంద్రాలుగా ఈ కేంద్రాల్లో పీహెచ్‌సీ స్థాయి సేవలందించాలని రూపకల్పన చేశారు. ప్రధానంగా దేశంలో మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. సకాలంలో వ్యాధి నిర్ధారణకు సరైన సదుపాయాలు లేక గుర్తించడంలో జాప్యం జరుగుతోంది. ఐదువేల మందికి ఒకటి చొప్పున నిర్వహించే ఆరోగ్య ఉప కేంద్రాల్లో పీహెచ్‌సీ స్థాయి వైద్య సేవలందించడానికి హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలకు శ్రీకారం చుట్టారు. దశల వారీగా వాటిని విస్తరిస్తున్నారు.

66 కేంద్రాల్లో నియామకం..

జిల్లాలో 126 ఆరోగ్య ఉప కేంద్రాల్లో 69 ఆరోగ్య మందిరాలుగా ఉన్నతీకరించారు. వీటిలో ఎంబీబీఎస్, ఆయుష్ వైద్యులు, లేదంటే బీఎస్సీ నర్సింగ్ చేసిన మిడిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లుగా నియమించారు. జిల్లాలో ఏర్పాటైన ఈ దవాఖానాల్లో 66 కేంద్రాల్లోనే ఎంఎల్‌హెచ్‌పీల నియామకం జరిగింది. ఇంకా మూడు కేంద్రాల్లో నియామకం చేపట్టాల్సి ఉంది. ఇక చాలా కేంద్రాల్లో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. సిబ్బంది, పరికరాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తే అవి రోగుల పాలిట నిజమైన ఆరోగ్య మందిరాలు అవుతాయి. మిగితా వాటిలో సిబ్బంది భర్తీ ప్రక్రియ పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. గతంలో జరిగిన ప్రక్రియపై ఒకసారి పరిశీలిస్తామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ తెలిపారు. అయితే ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మూడు కేంద్రాల్లో ఎంఎల్‌హెచ్‌పీలను నియమిస్తామని పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



తనిఖీ చేస్తున్న ఏవో రేవతి, ఎస్సై ఇమ్రాన్

గుడిహత్నూర్: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏవో రేవతి, ఎస్సై ఇమ్రాన్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాలను తనిఖీ చేశారు. లైసెన్స్ గల విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. వానాకాలంలో సమీపించడంతో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్న తరుణంలో ఎలాంటి పంటలు సాగు చేయాలని మండల వ్యాప్తంగా ఏఈవోలు వేర్వేరుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

అవసరమైన విత్తనాలను అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కైలాస్‌నగర్: రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా వారికి అవసరమైన పత్తి విత్తనాలు అందుబాటులో ఉంచాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవిని తన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆదిలాబాద్ పట్టణంలో పత్తి విత్తనాల కోసం రైతులు మండుటెండలో బారులు తీరి ఇబ్బంది పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలను అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, రోకండ్ల రమేశ్, విజ్జగిరి నారాయణ, లింగారెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

‘డీఏవో పుల్లయ్యను విధుల నుంచి తొలగించాలి’



మాట్లాడుతున్న మల్యాల మనోజ్

ఆదిలాబాద్‌రూరల్: రైతులకు సరిపడ పత్తి విత్తనాలు సకాలంలో తెప్పించడంలో విఫలమై, రైతుల ఆందోళనకు కారణమైన జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్యను తక్షణమే విధుల నుంచి తొలగించాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మాట్లాడారు. టాస్క్‌ఫోర్స్ బృందాలను నామమాత్రంగా ఏర్పాటు చేసి నకిలీ విత్తనాలు అరికట్టడంలో విఫలమైన ఆయన తన అసమర్థతను చాటుకుంటున్నారని ఆరోపించారు. నకిలీ విత్తనాలను అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. నాయకులు నక్క రాందాస్, లింగంపల్లి ప్రసన్నకుమార్, కత్తి గంగాధర్, ముక్కెర అశోక్, గజ్జల విలాస్, భూమన్న పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుడిహత్నూర్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేర విభాగం డీఎస్పీ హసీమ్, ఎస్సై ఇమ్రాన్ అన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు, స్థానికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఉచితాల పేర మహిళలు, బాలికలను సైబర్ మోసగాళ్లు ఎక్కువ మోసగిస్తున్నారని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల భారిన పడితే 1930 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. వీరి వెంట సిబ్బంది శ్రీధర్, తారాచంద్ ఉన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి

బేల: మండలంలోని బెదోడ గ్రామంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని బెదోడ గ్రామంలో లోవోల్టేజీ సమస్యపై లైన్ ఇన్స్‌పెక్టర్ మోసం రమేష్‌కు గ్రామస్తులతో కలిసి వివరించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆయన వెంట గ్రామస్తులు ధర్నే విజయ్, జీవన్, సురేందర్, సునీల్, గజానన్, తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



రైతుతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. బుధవారం మండలంలోని బుద్దికొండ నుంచి వడూర్ వెళ్లే రహదారి ఇరుపక్కలా గతంలో మొక్కలు నాటారు. అవి వృక్షాలుగా ఎదిగాయి. అయితే గంగా సింగ్ అనే రైతు పంట పొలం వద్ద ఉన్న చెట్ల అడుగు భాగం వరకు దున్నడంతో ఆ చెట్లు విరిగిపోయే ప్రమాదం ఉంది. దీంతో అధికారులు ఆయనకు అవగాహన కల్పించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, వీడీసీ చైర్మన్ కొట్టాల మోహన్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మామడలో క్రికెట్ పోటీలు

మామడ: మండల కేంద్రంలో బుధవారం సుంకిశాల చిన్నమ్మ-నారాగౌడ్ స్మారకార్థం క్రికెట్ పోటీలను మాజీ సర్పంచ్ హన్మాగౌడ్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల జట్లు పోటీలో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన జట్లకు షీల్డ్‌తోపాటు నగదు బహుమతిని అందించనున్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు.

సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ విడుదల చేస్తున్న సుకేష్ణ

బేల: సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ సఖీ కేంద్రం పారామెడికల్ హెల్త్ ఇన్‌చార్జి సుకేష్ణ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో సఖీ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సఖీ కేంద్రంలో కౌన్సెలింగ్, న్యాయం, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. సఖీ కేంద్రానికి వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని తంతోలి గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. గ్రామ పెద్దలు, సంస్థ ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి వాటర్ ప్లాంట్‌ను అందుబాటులో కి తీసుకువచ్చారు. బాల వికాస సంస్థ ముందుకు వచ్చి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాల వికాస ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు బాల మోహన్‌రెడ్డి, ప్రసూన్ రెడ్డి, నరేందర్, పంచాయతీ కార్యదర్శి సాల్మా సుల్తాన, సెవ్వ జగదీష్, కుమ్ర రాజు, వెంకటి పాల్గొన్నారు.

యూనిఫాంలు అందించాలి

నేరడిగొండ: పాఠశాలల ప్రారంభంలోగా యూనిఫాంలు విద్యార్థులకు అందజేయాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో యూనిఫాం క్లాత్‌ను మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు. వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాంలు అందించనున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజవీర్, ఎంపీవో లక్ష్మణ్, ఐకేపీ ఏపీఎం ఉత్తమ్, వనజ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తాం



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: గ్రామాల్లో నీటి తలెత్తకుండా చూస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని హీరాపూర్ గ్రామాన్ని సందర్శించి భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు చేయించి, నీటి సరఫరా చేయించారు. న్యూహీరాపూర్, మర్కగూడ, సమాక గ్రామాల్లో పర్యటించారు. నీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ సిబ్బంది నారాయణ, తదితరులు ఉన్నారు.

రైతులకు బీఆర్ఎస్ చేసిందేమిలేదు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: పదేళ్లు అధికారంలో ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చేసింది ఏమీ లేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. రైతులపై లాఠీచార్జి జరిగిందంటూ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులను నమ్మించి మోసం చేసి జైలుకు పంపింది మీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. రైతులకు ఉచితంగా ఎరువులు అందచేస్తామని మోసం చేసిందని, రైతుల గురించి మాట్లాడే అర్హత మీకు లేదన్నారు. కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఖయ్యుం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి



మాట్లాడుతున్న సాజిదొద్దీన్

ఆదిలాబాద్‌టౌన్: తాంసి బస్టాండ్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎమ్మెల్యే పాయల్ శంకర్ గతంలో ధర్నా చేశారని, ప్రస్తుతం నష్టపరిహారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి సాజిదొద్దీన్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. మంగళవారం రాత్రి అండర్‌బ్రిడ్జి పనుల మెటీరియల్ తరలిస్తున్న క్రమంలో కాలనీవాసులు అడ్డుకున్నారని, దీనిపై ఎమ్మెల్యే జవాబు చెప్పాలన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్న తరుణంలో కొందరు వ్యక్తులకు కోర్టుకు వెళ్లారని, నష్టపరిహారానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పుకొని జీవో విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. రాత్రి వేళల్లో కేంద్ర బలగాల భద్రత నడుమ సామగ్రిని తరలించేందుకు సరికాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పడితే ప్రమాదమే..



మండలంలోని దన్నూర్(బి) గ్రామం నుంచి నాగాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలు ఒకవైపు వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. అసలే వర్షాకాలం.. ఈదురు గాలులు వీచే అవకాశం ఉండదంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు. – బోథ్